


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### దొంగల బండి

**ప్రొద్దుటే ఫేస్‌బుక్ తీస్తే** ఒకాయన "మా కుటుంబం అంతా నార్త్ ఇండియా టూర్ వెళ్తున్నాం పాపం నా రోజా మొక్కకి ఇరవై రోజులు నీళ్ళుండవు. ఏమౌతుందో ఏమో?" అని స్టాటస్ పెట్టాడు.

ఇంకొక అమ్మాయి "వీ ఆర్ గోయింగ్ టు పప్పక్కాస్ మేరేజ్ ఫర్ ఫోర్ డేస్... అమ్మమ్మ ఎలోన్ ఎట్ హోమ్. షీ కాంట్ హియర్ ఆర్ సి" అని పెట్టింది. నాకనిపించింది "ఫేస్‌బుక్ ఎకౌంట్ సామాన్య మానవులకన్నా దొంగలకే చాలా ఉపయోగకరం. ఎవరెవరు ఎన్నెన్ని రోజులు ఎక్కడెక్కడికి వెళ్తున్నారో, ఏమేం చీరలూ, నగలూ కొంటున్నారో అన్నీ డీటైల్డ్‌గా పూస గుచ్చినట్లు తెలియాలంటే, వివరాల కోసం విరివిగా మనకి తెలిసినా, తెలియకపోయినా ఫేస్‌బుక్ రిక్వెస్ట్‌లు అందరికీ పంపి, ఎకౌంట్లు తెరవాలని" ఒకవేళ దొంగలు ఆలోచిస్తున్నారేమో.

పోచిరాజువారి చిట్టితల్లి "మై న్యూ డైమండ్ నెక్లెస్" అని పెడ్తుంది.

"వావ్.. బ్యూటీరే.. హౌమచ్?" అని ఒకావిడ అడుగుతుంది.

"జస్ట్ సిక్స్‌టీన్ లాక్స్" ఆ అమ్మాయి చెప్తుంది.

"లాకర్‌లో పెట్టావా?"

"నోరే.. ఇన్ మై అల్మారా.. చాలా మేరేజెస్ ఉన్నాయి కదా.. సో నేను రెడ్ జువెల్రీ బాక్స్ రాజీ వాళ్ళింట్లో రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిందే దానిలో పెట్టి మా బీరువాలో పెట్టా."

"సో నైస్ రే" అంటుంది మధ్యలో జారుడు బండ శ్రీవాణీ ప్రసన్న లక్ష్మీదేవి. ఈవిడెవరో ఆ పై వాళ్ళకి తెలీదు.

ఈ జారుడుబండ రాత్రికి వెళ్ళి పని పూర్తిచేస్తాడు. ఆఫ్టాల్ ఇల్లు, బీరువా అని తెలిసాకా రాజీ ఇచ్చిన జ్యువెల్రీ బాక్స్ పట్టుకోవడం ఎంతసేపూ?

ఆ తరువాత "అమ్మమ్మా ఎలోన్ వినలేదూ.. చూడలేదూ" వాళ్ళింటికి వెళ్ళేముందు, ఫేస్‌బుక్‌లో చక్కిలం ముక్కిలం అఖండ జ్యోతి స్వామీజీగారు "ఆయుష్మాన్‌భవ అమ్మమ్మ కోసం ఎవరైనా కాపలా వాళ్ళని కానీ, ఎటెండర్‌ని కానీ పెట్టారా అమ్మా?" అంటాడు.

ఈయనెవరో ఆ స్వప్నికారాణికి అస్సలు తెలీదు. ఎవరో పాపం స్వామీజీ, పెద్దాయన అని ఏడ్ చేసుకుంది. ఏ పోస్ట్ పెట్టినా, "చిరంజీవ! శతాయుష్మాన్ భవ. మీలాంటి యువత మాలాంటి వృద్ధులకి అవసరం తల్లీ!" అని పెడ్తుంటాడు.

సో ఇన్నోసెంట్‌గా "లేదు అంకుల్! అమ్మమ్మకి అలవాటే కుక్క కూడా లేదు. ఆవిడ ఒక్కత్తే ఉందని ఎవరికీ తెలీదు " అని రిప్లై ఇస్తుంది.

"శుభమస్తు" అంటాడు అఖండ జ్యోతి స్వామీజీ.

తరువాతరోజు అమ్మమ్మని స్టోర్‌రూంలో పెట్టి గెడ వేసి, ఇల్లంతా ఖాళీ చేసి, స్వామీజీ ఎకౌంట్ డిలీట్ చేసేముందు "తల్లీ శుభమస్తు. అమ్మమ్మా టైడ్ టు ఎ చైర్ ఇన్ స్టోర్ రూం. ప్లీజ్ చెక్" అని దయతో మెసేజ్ పెట్టి ఉడాయించెయ్యచ్చు.

"కిట్టీ పార్టీకి వెళ్తున్నాను హజ్బెండ్ ఈ వాలెంటైన్స్ డేకి 60,000రూపాయల శారీ కొన్నాడుగా అది కట్టుకునే" అన్న ఓ ప్రమీలారాణిని దార్లో ఆపి, ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ "తల్లీ ఈ కాటన్ చీర కట్టుకుని ఆ శారీ విప్పి ఇవ్వమ్మా" అని ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టచ్చు, చేతిలో కత్తిపట్టుకుని.

మొన్నామధ్య మా స్నేహితురాలింట్లో పెళ్ళి రిసెప్షన్ ఓ అతి గొప్ప హోటల్‌లో పెట్టింది, "చాలా ఖరీదు కదూ!" అంటే

"ఓన్లీ నియర్ అండ్ డియర్‌నే పిలిచానే.. టూ హండ్రెడ్ దాటరు" అంది.

తీరా ఆరొందలు మంది వచ్చారు.

"ఏవిటే ఇదీ?" అన్నాను.

"ఎవరో నాకు కూడా తెలీట్లేదే" అంది.

తర్వాత తెలిసిన విషయం, ఊరు పేరూ తెలీని ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ అన్నమాట.

ఈవిడ ఫేస్‌బుక్‌లో ఓపెన్ ఇన్విటేషన్ పెట్టింది. తడిసి మోపెడయి, ఇల్లు అమ్మకానికి పెట్టాల్సొచ్చింది.

కేవలం డబ్బూ, నగలూ దొంగిలించే దొంగలే అనుకుంటున్నారా? కాదు ఒక పెద్దాయన ఎడాపెడా కవిత్వం రాసేస్తుంటాడు. అది పక్క వాళ్ళ టైమ్‌లైన్‌లోది, ప్రైవేట్ సెట్టింగ్స్‌లో ఎవరిది కాపీ కొడ్తున్నాడో, అతను మాత్రం చూడకుండా... ఎక్సెప్ట్ నిడదవోలు నీల్గుడురావ్ అని ఉంటుంది. అంటే అతను మాత్రం చూడలేడు.

ఇంకొక ఆవిడ, బాగా జనాదరణ పొందిన సీరియల్ తను రాస్తున్నానంటుంది. అందరూ ఆవిడని మెచ్చుకోవడమేకాదు కొందరు వేషాల పిచ్చివాళ్ళు, డబ్బులు చదివించుకుంటాం, వేషాలు ఇప్పించమని 'ధర'ఖాస్తులు పెట్టుకుంటారు. ఉభయత్రా లాభం.

ఒకావిడ ప్రొద్దుటే "నన్ను నేను ప్రమోట్ చేసుకుంటే తప్పేవిటి రచయిత్రిగా?" అంటూ దుప్పట్లు కప్పించుకుంటూ, సత్కారాలు అందుకుంటున్న ఫోటోలు, పేజ్ మొత్తం ఎవరికీ దొరకకుండా, సందివ్వకుండా పెట్టింది.

అవును తప్పేవిటి? అనుకుంటూ, సదరు రచయిత్రి పుస్తకం ఒకటి కొనుగోలు చేసి, ఇంట్లో ఎప్పుడైనా చదువుదామని పెట్టాను. ఒంట్లో బాలేక, ఇంట్లో ఉన్న అమ్మ ఆ పుస్తకం తీసి ఒకటో అరో పేజీలు చదివేసింది. దాంతో ఆవిడ పరిస్థితి ఊపిరి అందకుండా అయింది. గిలగిలా కొట్టుకుని, నేను ఫస్ట్ ఎయిడ్ చేసాకా "ఇవి కథలా? కవితలా? కాదు.. ఆటంబాంబులు.. చురకత్తులు" అంది. చూశారా కత్తి కన్నా కలం గొప్ప అని ఎలా నిరూపణయిందో!

అంతలా ఏం రాసిందబ్బా అని, మొదటి పేజీ తిప్పి చూసాను.

"అమ్మా చూడాలీ నిన్నూ నాన్నని చూడాలీ.. రైల్లో వచ్చి చూడాలీ.. పొగ వదిలే రైల్లో వచ్చి చూడాలీ.. పల్లీల వాడిని పిలిచి పల్లీలు కొనాలీ... కాఫీ.. కాఫీ. అని కేకేసే వాడిని పిలిచి కాఫీ కొనాలీ.. కింద నేను పడేసే పల్లీలు పొట్టు తుడిచేవాడికి పైసలు వెయ్యాలీ.. వాడి చొక్కా చిరుగులు లెక్కపెట్టాలీ... పాటలు పాడే అమ్మాయిని పిలవాలీ.. 'దబాంగ్'లో "మున్నీ బద్నాం హుయే" పాడించాలి. రైలు కూత పెట్టాలీ.. చెట్లూ, ఇళ్ళూ దాటాలీ.. ఒకటో చెట్టూ, రెండో చెట్టూ, మూడో చెట్టూ, నాలుగో చెట్టూ, ఐదో చెట్టూ... ఆరో చెట్టూ.."

నాకు కళ్ళు తిరిగాయి. అమ్మ అంతగా ఎందుకు గిలగిలలాడిందో అర్థమైంది. కాసేపటికే ఫ్యామిలీ డాక్టరొచ్చి చూసాడు. ఈవిడని కథలకీ, కవిత్వాలకీ దూరం పెట్టండి ఎందుకైనా మంచిది అని ప్రిస్క్రిప్షన్ రాసిచ్చి వెళ్ళిపోయాడు.

ఇంకొక అలివేణి "మా బుజ్జిపండు పేరు వీరవెంకట ప్రతాప సాయికిరణ్ రేఖా వజ్జుల... వీడు మహాత్మాగాంధీ స్కూల్లో రెండవ తరగతి చదువుతున్నాడు. చాక్లెట్ ఇస్తానంటే ఎవరితోటైనా వెళ్ళిపోతాడు. వీడు మా వంశాంకురం. మా ఆస్తికి వారసుడు. వీడి నాలుగో పుట్టినరోజు" అని పెట్టింది.

సాయంత్రం స్కూల్ నుండి పిల్లవాడు రాలేదు. దొంగ బాబాయ్ చాక్లెట్లు కొనుక్కుని వీర వెంకట ప్రతాప సాయికిరణ్ బడికెళ్ళాడు.

వయసు పైబడ్డ ఒకావిడ, పిల్లలు విదేశాల్లో ఉండడం మూలాన ఒంటరిగా ఇక్కడ ఉంటుంది. ఒక రోజు డోర్ బెల్ మోగితే వెళ్ళి తీసింది. అవతల నిలబడ్డ అపరిచితుడు లోపలికొచ్చి 'కసక్'మని కత్తితో పొడిచాడుట ఎందుకంటే ఆవిడ యంగ్ అప్పటి ఫోటో పెట్టింది. అతను ప్రేమలో పడి ప్రైవేటు మెసేజ్‌లు ఇస్తుంటే పట్టించుకోవడం లేదుట. అతను మూర్ఖంగా, సిన్సియర్‌గా ప్రేమించేసాడు.

"ఈ రోజు వాకిట్లో ముగ్గు వేసి మధ్యలో బంతి పూవు పెట్టాను. నీ అడుగుల కిందపడి నలగడానికి అది ఎదురు చూస్తోంది ప్రియా" లాంటి కవితలతో అతన్ని రెచ్చగొట్టింది.

ఆవిడ ఏం పెడ్తున్నా అది తన కోసమే అనీ... ఓ పదహారేళ్ళ ముగ్ధని ఊహించుకుంటూ ఉన్న అతనికి సడెన్‌గా ఆవిడ బయట ప్రపంచంలో పరిచయం ఉన్న ఒకతను తగిలి "ఫలానా లావణ్య మయూరి కలికి గురించా... నీ బాధ? ఆవిడకి అరవై ఏళ్ళు. మా పక్క బ్లాక్‌లో ఉంటుంది చూపిస్తా రా!" అని చూపించాడు.

దాంతో ఈ ప్రేమికుడు రగిలిపోయి ఆవిడ ఇంటికెళ్ళి, తలుపు తియ్యగానే కసక్ మని పొడిచి "ఎందరు అమాయకుల జీవితాలతో ఆడుకుంటావే?" అని రాసి అక్కడ పారేసి వచ్చాడు.

ముక్కూ మొహం, ఊరూ, చిరునామా తెలీని ఎందర్నో మనం ఫేస్‌బుక్‌లో స్నేహితులని చేసేసుకుంటాం. వీళ్ళల్లో సీరియల్ కిల్లర్స్ ఉన్నారేమో సీరియస్‌గా ఆలోచించారా మీరు? అంతెందుకు మెంటల్‌గా డిస్టర్బ్ అయిన వాళ్ళూ, సైకోలూ ఎంతమంది ఫేస్‌బుక్‌లో ఉంటారో మనకి తెలుసా? ఒక కవి ప్రొద్దుటినుండీ సాయంత్రం దాకా కవితలు రాసి ఎఫ్.బిలో పెడ్తాడు. పెళ్ళాం మొత్తుకుంటుంది, "పైసారాదు.. వందల లైకులు తప్ప" అని.

ఇంకొక అమ్మాయి ప్రొద్దుటి నుండీ తను స్పాలో ఎంతసేపు గడిపిందో, బోయ్‌ఫ్రెండ్‌తో ఎక్కడికి వెళ్తోందో పెడ్తుంది. వాడి పెళ్ళాంకి తెలిస్తే బతుకు బస్‌స్టాండ్

నిక్‌నేమ్స్‌తో, సినిమా తారల ఫోటోలతో పోస్ట్‌లు పెట్టేవాళ్ళ అసలు మొహాలు మీకు తెలుసా?

ఇదివరకు వయసు పైబడ్డాక బామ్మలూ, అమ్మమ్మలూ, తాతయ్యలూ పిల్లలకి పురాణాలు చెప్పేవారు. ఏ హరికథకో వెళ్ళేవారు, లేదా భాగవతం కానీ రామాయణం కానీ చదువుకునే వారు. ఇదేవిటండీ ప్రొద్దుటే పళ్ళైనా తోముకోకుండా ఫేస్‌బుక్ పఠనం?

"ఇదిగో... ఏవోయ్ మీ అక్కయ్య కొడుకు మళ్ళీ పోలిటిక్స్ గురించి అవాకులు, చవాకులూ మాట్లాడ్తున్నాడు. వీడ్ని ఎప్పుడో జైల్లో వేసేస్తారు" అంటాడు ఓ గుర్నాథం.

"మీ చెల్లెలు కూతురు చూడండి.. విమెన్స్ నైట్ అంటూ షాంపెయిన్ బాటిల్ ఎత్తి ఫోటో పెట్టింది. ముందు దాని కాపురం గురించి చూసుకోండి" అంటుంది పెళ్ళాం.

వన్ ఫైన్ మార్నింగ్ శర్మగారి ఇంటి తలుపు ఒకతను కొడ్తాడు. తీస్తే పెట్టే బేడాతో ఉంటాడు "నువ్వు కామాక్షి కొడుకువి కదూ.. అమ్మా నాన్నా చెన్నైలో బావున్నారా? నేను రూర్కీ పెద్దనాన్నని. హైదరాబాద్ వెళ్తున్నాను ఎక్కడ ఉండాలా? అని ఆలోచిస్తుంటే మీ ఎడ్రెస్ ఇచ్చాడు మీ ఆఖరి బాబాయ్ వెదురు బొంగుల వెంకట నామాల శర్మ," అంటాడు.

సుభద్రమ్మకి లీల పాటల పుస్తకం, శర్మకి నాలుగు కొమ్మూరి నవలలూ ఇచ్చి "మీ ఇష్టాల గురించి మీ అమ్మ చెప్పింది" అన్నాడు.

ఇంక అతను చుట్టం కాడని ఆలోచించడానికి ఏం ఉండదు. సుభద్ర మురిసిపోతూ "తగదిది ... తగదిదీ.. ధరణీహర వర సుకుమారీ తగదదీ" అని పాడుతుంది.

"అమ్మా నీ చేతివంట గురించి విన్నాను. ఉప్మా పెసరట్టు బాగా చేస్తుంది మా కోడలు అని మీ అత్తగారు చెప్పారు. సుభద్రకదూ నీ పేరు. భోజనంలోకి సింపుల్‌గా వంకాయ కాల్చి పులుసుపచ్చడి చేసి, ముద్దపప్పూ, మజ్జిగ పులుసూ, వెధవది నాలుగు బంగాళా దుంపలు వేయించు. వడియాలూ, ఊరమిరపకాయలూ, అప్పడాలు, కందిపొడీ, కారంపొడీ, గోంగూర పచ్చడీ, ఆవకాయిలాంటివి ఎటూ ఉంటాయిగా" అంటాడు.

సుభద్రమ్మ చేత రుచులు రుచులుగా చేయించుకుని తిని, రెండు రోజులపాటు శర్మగారి కారుకి ఫుల్‌గా పనిపెట్టి, తన పనులు చేయించుకుని వెళ్ళిపోయాక ఈ బృహస్పతి మావయ్య ఎవరా అని మీ ఆఖరి బాబాయిని కానీ, మీ అమ్మని కానీ మీరు అడుగుతారు. దాంతో వాళ్ళు నుదురు కొట్టుకుని ఆలోచిస్తారు. కానీ అసలు సంగతి ఏవిటంటే, బృహస్పతికి హైదరాబాద్‌లో పనొచ్చినప్పుడు, ఫ్రీ లాడ్జింగ్, బోర్డింగ్ కోసం ఎఫ్.బి తీసి హైదరాబాద్ ఫ్రెండ్స్ ఎవరెవరున్నారా? అని వెతికాడు. లేదా సెంటర్‌లో ఉన్న వాళ్ళకి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపాడు. పాత పోస్ట్‌లు చూసాడు. శర్మగారికి కారుంది. రెండతస్తుల ఇల్లుంది "మై ఫ్యామిలీ" అని నవ్వుతూ తీయించుకున్న గ్రూప్ ఫోటో.. వివరంగా దాని కింద ఆయన తల్లితండ్రులూ, బాబాయ్‌లు, పిన్నులూ, అత్తయ్యల పేర్లూ బృహస్పతి నోట్ చేసుకున్నాడు.

కింద సుభద్రమ్మ పెట్టే వంటకాలకి శర్మగారు పెట్టే కాప్షన్ "పెసరట్టూ ఉప్మా మా కోడలిలా ఎవరూ చెయ్యలేరని మా అమ్మ కాంప్లిమెంట్" అని పెసరట్టు ఫోటో.

సుభద్రమ్మకి లీల పాడిన పాటలు చాలా ఇష్టం.. శర్మగారికి కొమ్మూరి సాంబశివరావుగారి డిటెక్టివ్ పుస్తకాలు ఇష్టం. ముఖ్యంగా వీళ్ళ ఇంట్లో కుక్కలు లేవు. వాచ్‌మెన్ లేడూ అని నిర్ధారణ చేసుకుని వీళ్ళ మనవల, కొడుకుల, కోడళ్ళ పేర్లు గుర్తుపెట్టుకుని బృహస్పతి ఇలా దిగిపోయాడు.

ఇంతవరకూ కొంతమేలు. అదే బృహస్పతి బుద్ధి చెడి ఏ అర్ధరాత్రో శర్మదంపతుల నోట్లో గుడ్డలు కుక్కి ఉన్నదంతా ఊడ్చుకెళ్ళిపోతేనో!

ఈసారి అన్నీ నెగిటివ్ కబుర్లే రాస్తున్నా ఎఫ్.బి గురించి అనుకుంటున్నారా? అప్రమత్తం చెయ్యకపోతే డెబ్భై ఏళ్ళ ఆండాళమ్మగారు పోర్న్ వీడియో క్లిప్పింగ్స్ పంపించిన పోస్ట్‌లా ఘోరాలు జరుగుతాయి. కొందరు మన ఎకౌంట్లు హేక్ చేసి ఇలాంటి అశ్లీలమైన దిక్కుమాలిన వీడియోలు పంపిస్తే మన పేర్లమీద ఎలా ఉంటుందీ?

ఆండాళమ్మగారు ఏకాదశీ ఉపవాసం ఉండి బియ్యం రవ్వ విసురుకుంటుంటే, ఫోన్‌లు "ఏవమ్మా ఈ వయసులో బుద్ధిలేదూ? ఈ అసభ్యమైన సైట్స్‌కి వెళ్ళడమే కాకుండా మాకు ఈ బ్లూఫిల్మ్ వీడియోలు పంపిస్తావా?" అని.

ఆవిడ తెల్లబోయి "హైదరాబాద్‌లో ఉప్పల్‌లో ఒకటి బోడుప్పల్లో ఒకటీ రెండు సైట్లున్నాయని మా ఆయన చెప్పారు. నేను ఎన్నడూ ఆ సైట్లకే వెళ్ళలేదు. ఈ సైట్లు ఎక్కడున్నాయి? ఎప్పుడెళ్ళానూ? మామూలుగా నల్ల ఫిల్మ్‌లున్న కెమేరాలు కూడా వాడటం లేదు. ఈ బ్లూ ఫిల్ములు ఎక్కడివీ?" అని అమాయకంగా అడిగింది.

ఈలోగా ఎఫ్.బిలో ఈవిడ్ని బ్యాన్ చెయ్యాలనే ప్రతిపాదనలు, ఘోరంగా తిట్లూనూ. ఇవన్నీ కొడుకు చూసి తలబాదుకుని ఆఫీస్‌కి లీవ్ పెట్టి, తల్లి ఎఫ్.బికి ప్రైవసీ సెట్టింగ్స్ చెయ్యడానికి ఇంటికొస్తాడు.

ఇంక సినిమా వాళ్ళంటే పబ్లిక్ ప్రాపర్టీ. మహా అలుసు. మహేష్ బాబుకి బట్టతలతో మార్ఫింగ్ ఫోటోస్, ప్రభాస్ గురించో, ఇంకో హీరోయిన్ గురించో గాసిప్స్.

అబద్ధపు రక్తదానం రిక్వెస్టులు. తీరా మంచి ఉద్దేశంతో మీరు ఫోన్ చేస్తే మీ ఎకౌంట్ హేక్ చెయ్యడం, మీ వివరాలు రాబట్టడం. ఈ ఫోటోని షేర్ చేస్తే, లైకులు కొడితే ఈ బిడ్డ జబ్బు నయం అవుతుంది అని ముక్కులోంచీ, మూతిలోంచీ గొట్టాలు పెట్టిన పసిపాప రూపం. లేదా ఈ వినాయకుడి ఫోటో మీరు షేర్ చేసుకున్న పదిరోజుల్లో మీకు లాటరీ వస్తుంది, లేదా దుంపనాశనం అయిపోతారని శాపనార్థాలు.

ఇవన్నీ కాకుండా మీ బ్లడ్‌గ్రూప్ ఏమిటో చెపితే మీ కేరక్టర్ చెప్తాం అనీ లేదా స్టార్ చెపితే జాతకం చెప్తామనీ, బోలెడు పోస్ట్‌లు. పెళ్ళాం అది ఫాలోఅయి మూతివిరుపులు.

అసలు ఈ ఎఫ్.బి చూసినంత సేపు నేను క్లాసు పుస్తకాలు చదివితే, కలెక్టర్ అయిపోదును.

ఇంక ఈ ఎఫ్.బిలో కాండీక్రష్‌లనీ, ఫార్మ్‌విల్లా సాగా అని అలవికాని ఆటలు.. వీళ్ళకడుపు చల్లగా ఏం ఆడినా ఆడ్తారు. ఆడితే ఆడారు తెల్లారిన దగ్గర్నుంచీ మనకేం పనీపాటా లేనట్టు ఆడమని ఈ ఆహ్వానాలెందుకు? వీళ్ళ ఇల్లు నేలకట్టా! వీళ్ళిళ్ళలో పెళ్ళిళ్ళు జరగా... ఈ తిట్లు ఏవిటా అని ఆశ్చర్యపోతున్నారా? మరింకేం తిడ్తాం? అందులో మన కిత్ అండ్ కిన్ కూడా ఉంటున్నారు. అందుకే ఒళ్ళుమండిపోతుంటే మా నాయనమ్మ తిట్లు తిడ్తున్నా! ఆవిడ నోట ఒక్క అశుభం వచ్చేది కాదు. "నీ ఇంట్లో పెళ్ళవ్వా" "నీ ఇల్లు బంగారం కాను", "నీకు గంపెడు పిల్లలు పుట్టా" అనేది.

మా అన్నయ్య ఒకడు గోంగూర లేకుండా ముద్దెత్తేవాడు కాదు ఓసారి డాక్టర్ గోంగూర తినొద్దని చెప్పాడుట. అతను ఇంటికొచ్చి, చాలా దిగులుగా ఈ విషయం పిల్లలకి చెప్పి "గోంగూర లేకుండా ఎలారా?" అన్నాడు.

కొడుకు వెంటనే "ఎకరాలు ఎకరాలు గోంగూర తినేసావు పుట్టినప్పటినుండీ.. ఇంకా నీకు విసుగు పుట్టలేదా నాన్నా?" అన్నాడు.

అలా పొద్దస్తమానం ఎఫ్.బిలో ఉన్నా తృప్తి తీరక రాత్రుళ్ళు నిద్రలు కూడా మానుకుని ఈ సేద్యం చేసి, రోగాలపాలయ్యే వారి సంఖ్య..... చూడాలంటే మన లాప్‌టాప్‌లో ఎఫ్.బి పేజ్‌లో గ్రీన్ చుక్కలు చూపెడ్తుంది చూడండి.

ఒక దొంగ ఇంకో దొంగతో అన్నాడు "ఇంటాయన ఆఫీస్‌కీ, పిల్లలు స్కూల్‌కీ వెళ్ళాక మనం ఆ ఇంట్లోకెళ్ళి దొంగతనం చేసుకోవచ్చు"

"ఇంటావిడ ఎక్కడికెళ్తుంది?"

"ఎఫ్.బి.లోకి"

కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని, చెప్పుకున్న కొద్దీ ఉన్నాయి ఎఫ్.బి ముచ్చట్లు.

అసలు మన టెలిఫోన్ డైరెక్టరీలో ఎల్లో పేజెస్‌లా, మన సమాచారం ఏప్ జస్ట్ డయిల్‌లా ఈ ఎఫ్.బి దొంగల పుస్తకం అయింది. మన బతుకు హైదరాబాద్ రోడ్ల మీద రిక్షా బండి అయింది.

ఒక్క అమ్మాయి పెట్టే ముఖాన్ని నమ్మలేం. ఒక్క అబ్బాయి పెట్టే సమాచారాన్ని నమ్మలేం. ఒకరింట్లో చూపిస్తున్న అనురాగాల్ని నమ్మలేం. ప్రజాక్షేమం కోసం అది తాగకండి.. అందులో సైనేడ్ ఉందీ. ఇది తినకండి ఇందులో ప్లాస్టిక్ ఉందీ అంటూ పోస్ట్‌లు పెట్టే

గగ్గోలమ్మలనీ అభినవ గూగులయ్యలనీ నమ్మలేం. అసలు నమ్మకం మీదే నమ్మకం పోయేంత 'ఫేక్' చేస్తున్న ఈ ఫేక్‌బుక్‌ని అస్సలు నమ్మలేం. "పిల్లి తల గొరికే వాడికి కత్తి నూరేవాడు ఒకడనీ" ఈ ఫేస్ బుక్‌కి మళ్ళీ మేనేజర్లని ఎపాయింట్ చేసుకోమని ఏడ్ ఒకటి.

**ఇంతకీ చెప్పేదేవిటంటే ఇది దొరల పుస్తకం అయినా దొంగమావయ్యలుంటారు జాగ్రత్త!**

Post your comments

